సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 16 । జూన్ । 2023



అనుమతి లేని బడులు..
జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు, ప్లే స్కూళ్లు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. కొన్నింటిని అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నారు.
- 8లో ▸



ఆయిల్‌పాం సాగులో..
ఆయిల్ పాం సాగు చేస్తున్న రైతులు అంతర పంటలు వేస్తు లాభాలను గడిస్తున్నారు. అంతర పంటగా సజ్జ, జొన్న వేస్తున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.3 /28.3

వాతావరణం
ఉదయం నుంచే ఎండ వేడిమి అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రెడ్‌క్రాస్ బృందానికి కలెక్టర్ అభినందనలు



సుభాష్‌నగర్ : ఐఎస్‌ఓ సర్టిఫికెట్ పొందినందుకుగాను జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం సాయంత్రం నిజామాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ బృందాన్ని అభినందించారు. భవిష్యత్‌లో ఇలాగే నిజామాబాద్ రెడ్‌క్రాస్ సేవలు విస్తరించాలని, రాష్ట్రంలో జిల్లా కీర్తిని మరింత ప్రతిబింబింపజేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ చిత్రామిశ్రాను రెడ్‌క్రాస్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను రెడ్‌క్రాస్ బృందం సన్మానించింది. కార్యక్రమంలో నిజామాబాద్ రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపె రవీందర్, కార్యదర్శి అరుణ్ బాబు, నిజామాబాద్ డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం, పీఆర్వో బొద్దుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'కంటి వెలుగు'

- జిల్లాలో 7,39,055 మందికి కంటి పరీక్షలు



నిజామాబాద్ సిటీ: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం ముగిసింది. కంటి వెలుగు కార్యక్రమం జనవరి 19న ప్రారంభం కాగా 525 గ్రామాలు, 153 వార్డులు, డివిజన్లలో పూర్తి చేశారు. ఇప్పటి వరకు 7,39,055 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో మగవారు 3,34,016, ఆడవారు 4,03,700, ట్రాన్స్‌జెండర్లు 1339 మంది ఉన్నారు. కంటి పరీక్షలు చేసుకున్న వారిలో 5,65,370 మందికి ఎటువంటి కంటి సమస్యలు లేవని గుర్తించారు. కంటి సమస్యలు ఉన్నవారిలో దగ్గరి చూపు సమస్య ఉన్న వారికి రీడింగ్ అద్దాలు 88,133 మందికి పంపిణీ చేయగా, దూరపు చూపు సమస్య గల వారు 85,541 మంది ఉండగా, వీరిలో ఇప్పటివరకు 67,894 మందికి అద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన 17,647 మందికి అద్దాలు పంపిణీ చేయవలసి ఉన్నాయి.

స్పోర్ట్స్ కోచింగ్‌కు దరఖాస్తులు

నిజామాబాద్‌నాగారం : భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో లక్ష్మీబాయి నేషనల్ ఇ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్వాలియర్ 2023–24 సంవత్సరానికి గాను పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్, డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్, ఇతర కోర్సుల కోసం ప్రవేశ కోసం జూన్, జూలై నెలలో అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అధికారి ముత్తెన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమిక్ సెషన్ 2022–23 కొరకు, అర్హత ప్రమాణాల వివరాలు, వివధ కోర్సులలో ఈవెంట్స్ వివరాలను www.lnipe.edu.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చున్నారు. లేకుంటే ఫోన్ నంబర్ 0751–4000887 సంప్రదించాలన్నారు.

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్



ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో గురువారం రెండో రోజు ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ (ఏఆర్) గిరిరాజు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగింది. 650 మంది అభ్యర్థులను పిలవగా అందులో 563 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి (ఏవో) శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు శంకర్, మక్సూద్ హైమద్, గోవింద్, సీపీవో కార్యాలయం సిబ్బంది, రిజర్వు విభాగం సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



బట్టాపూర్ గుట్ట మింగివేతపై పిల్

- హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసిన బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డి
- ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో కేసు విచారణకు నంబర్ కేటాయింపు
- వారం క్రితం 'ఈటీఎస్' సర్వే చేసిన గనుల శాఖ బృందం
- 'గుట్టలు గుల్ల' కథనంతో గుట్ట స్వాహాను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'

బట్టాపూర్ గుట్ట వద్ద 9,280 క్యూబిక్ మీటర్లకు అనుమతులు ఉండగా ఇప్పటి వరకు ఏకంగా 15 లక్షల క్యూబిక్ మీటర్ల మేర స్వాహా చేసినట్లు అధికార వర్గాల అంచనా. జియోట్యాగింగ్ ద్వారా పరిమితికి మించి గుట్టను తవ్వేసినట్లు అధికారులు గుర్తించారు.



తవ్వకాలు జరుపుతున్న బట్టాపూర్ గుట్ట

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని ఏర్గట్ల మండలం బట్టాపూర్ వద్ద నిబంధనలు అతిక్రమించి గుట్టను తవ్వుతున్న విషయమై గురువారం రాష్ట్ర హైకోర్టులో పిల్ (ప్రజాప్రయోజన వ్యాజ్యం) దాఖలైంది. కేవలం 9,280 క్యూబిక్ మీటర్లకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ ఏకంగా ఇప్పటివరకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల మేర స్వాహా చేసినట్లు అధికార వర్గాల అంచనా. ఈ విషయమై గత డిసెంబర్ 9న 'సాక్షి'లో 'గుట్టలు గుల్ల' అనే కథనం ప్రచురితమైంది. 195/1 సర్వే నంబర్‌లో 3.85 హెక్టార్లలో ఉన్న ఈ గుట్ట లీజును 2016లో తీసుకున్నప్పటికీ, రక్షిత అటవీ ప్రాంతం ఆనుకుని ఉంది. అయితే కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండానే ఈ గుట్టను తవ్వడం మొదలుపెట్టారు.

జియో ట్యాగింగ్ ద్వారా పరిమితికి మించి పూర్తిగా తవ్వేసి గుట్టను మింగేసినట్లు అధికారులు గుర్తించారు. పరిమిత అనుమతులు మాత్రమే ఉన్న దీనికి అనుబంధంగా నెలకొల్పిన క్రషర్‌కు అధికారికంగానే ఇప్పటి వరకు ఏకంగా రూ.2.5 కోట్ల విద్యుత్ బిల్లు చెల్లించారు. ఇలాంటి నేపథ్యంలో అనధికారికంగా ఎంత మాయాజాలం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అ యితే ఈ స్వాహా పర్వం వెనుక జిల్లాకు చెందిన ప్ర ధాన ప్రజాప్రతినిధి ఉండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. గతంలో ఒకసారి తనిఖీకి వచ్చిన అటవీ క్షేత్రాధికారి ఆనందరెడ్డి 24 గంటల్లో నే బదిలీ అయ్యారు. మరోవైపు గతంలో వరుసగా 8 నెలల పాటు రూ.51 లక్షల విద్యుత్ బిల్లు పెండింగ్‌లో పెట్టినప్పటికీ విద్యుత్ సరఫరా మాత్రం ఆగ లేదు.



గత డిసెంబర్‌లో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



బట్టాపూర్ గుట్ట తవ్వకాలు

'సాక్షి'లో కథనం ప్రచురితం కాగానే ఈ బిల్లు ను చెల్లించడం గమనార్హం. ఇదిలా ఉండగా దీనిపై గత సెప్టెంబర్ 24న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు వెళ్లింది. అక్కడి నుంచి గత అక్టోబర్ 1న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ వచ్చింది. అక్కడి నుంచి గత డిసెంబర్ 3న మైనింగ్ డైరెక్టర్‌కు ఆదేశాలు వెళ్లాయి. తరువాత అక్కడి నుంచి నిజామాబాద్ మైనింగ్ ఏడీకి సర్వే కోసం ఆదేశాలు వచ్చాయి. అయితే ప్రధాన ప్రజాప్రతినిధి కన్నెర్ర చేయడంతో ఏడీ సర్వే చేయలేదు.

హైదరాబాద్ బృందం సర్వే..

ఈ క్రమంలో వారం రోజుల కిందట హైదరాబాద్ నుంచి వచ్చిన మైన్స్ అండ్ జియాలజీ విభాగానికి చెందిన బృందం 'ఈటీఎస్' (ఎలక్ట్రానిక్ టోటల్ సర్వే) నిర్వహించారు. సదరు నివేదిక ఇప్పటికే మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్‌కు వెళ్లింది. కాగా గుట్టను తొలిచే క్రమంలో వాడుతున్న జిలెటిన్ స్టిక్స్, ఇతర పేలుడు పదార్థాలు 'మ్యాగ్జిన్'లో స్టోర్ చేయాలి. లేనిపక్షంలో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఉంచాలి. దేశ, సంఘవిద్రోహ శక్తులకు చేరకుండా ఉండేందుకు ఈ నిబంధన ఉంది. ఈ నిబంధనను సైతం ఇక్కడ తుంగలో తొక్కడం గమనార్హం. ప్రమాదకర పరిస్థితుల్లోనే పేలుడు పదార్థాలు నిల్వ ఉంచడం విస్మయం కలిగిస్తోంది.

ఆధారాలతో కోర్టుకు..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి బట్టాపూర్ గుట్ట వ్యవహారంపై అనేక ఆధారాలతో, 'సాక్షి' కథనంతో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యానికి సంబంధించి తాజాగా హైకోర్టు సీరియల్ నంబర్ 21393 ఆఫ్ 2023 కేటాయించింది. ఇందుకు సంబంధించి హైకోర్టు మైన్స్ అండ్ జియాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిజామాబాద్ జిల్లా కలెక్టర్, ఆర్మూర్ ఆర్డీవో, నిజామాబాద్ మైనింగ్ ఏడీ, ఏర్గట్ల తహసీల్దారులకు నోటీసులు పంపింది.

లోటుపాట్లు గుర్తిస్తే మార్పులు చేస్తాం

- ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ప్రత్యేక ఓటరు సమోదు కార్యక్రమం ద్వారా రూపొందించిన ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటరు జాబితాలో లోటుపాట్లు గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలతో పాటు రాజకీయ పార్టీల పాత్ర కూడా ఎంతో క్రియాశీలకమైనదని అన్నారు. దీని వల్ల ఓటరు జాబితా పక్కాగా రూపకల్పన జరిగి ఎన్నికల సమయంలో ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాల్సిన ఆవశ్యకతను గుర్తిస్తే, తమకు ప్రతిపాదనలు అందించాలన్నారు. వాటిని ఎన్నికల అధికారులతో పరిశీలన చేయించి, సహేతుకమైన వాటిని ఆమోదిస్తూ మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. ఎక్కడైనా పోలింగ్ స్టేషన్ మార్చాల్సి ఉన్నా, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలను ప్రతిపాదించవచ్చని సూచించారు. ఒక ప్రాంతానికి చెందిన ఓటర్లను సమీప పోలింగ్ బూత్ పరిధిలో కాకుండా వేరే బూత్ పరిధిలో ఓటరుగా చేర్చినట్లు గుర్తిస్తే, ఆ ఓటర్ల వివరాలు తమకు తెలియజేయాలని తెలిపారు. వీటికి సంబంధించి జూలై 24లోపు తమకు ప్రతిపాదనలు అందిస్తే, వాటి ఆధారంగా సవరణలు చేసిన ఓటరు జాబితాతో ఆగస్టు 2న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తామని కలెక్టర్ వివరించారు. 2023 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తవుతున్న యువతీ యువకుల పేర్లు, వివరాలను ఓటరు జాబితాలో చేర్పించాలన్నారు. ఓటరు జాబితాలో బోగస్ ఓటర్లు, డూప్లికేషన్‌లకు తావులేకుండా పకడ్బందీగా పరిశీలించాలన్నారు. బూత్ లెవెల్ అధికారులతో నిర్వహిస్తున్న ఇంటింటి పరిశీలన కార్యక్రమానికి కూడా సహకారం అందించాలని కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సమావేశంలో ఆయా నియోజకవర్గాల ఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ పాల్గొన్నారు.

వైద్యులు లేరు.. మెరుగు పడని సేవలు

- భర్తీలో తాత్సారం చేస్తున్న ప్రభుత్వం
- వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులు



మోర్తాడ్(బాల్కొండ) : వైద్య ఆరోగ్య శాఖ నుంచి సామాజిక ఆస్పత్రులను వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసినప్పటికీ తగినంత మంది వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. మోర్తాడ్, బాల్కొండ, డిచ్‌పల్లి, ధర్పల్లి, వర్ని, నవీపేట్‌లలో 30 పడకలు ఉన్న ఆస్పత్రులు ఉన్నాయి. ఆర్మూర్‌లో వంద పడకల ఆస్పత్రి ఉంది. భీమ్‌గల్‌లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కొనసాగుతోంది. 30 పడకల ఆస్పత్రిలో వివిధ రకాల వైద్యం అందించే 14 మంది వైద్యులు, 18 మంది వివిధ హోదాలలో పని చేసే సిబ్బందిని నియమించాల్సి ఉంది. వంద పడకల ఆస్పత్రిలో 48 మంది వైద్యులు, 73 మంది సిబ్బంది పోస్టులను ఖరారు చేశారు. భీమ్‌గల్ ఆస్పత్రి నిర్మాణం ఇంకా పూర్తికానందున మిగిలిన ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేశారు. జిల్లాలో మొత్తం 132 మంది వైద్యులు, 181 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఇప్పటి వరకు పోస్టుల భర్తీపై దృష్టి సారించకపోగా నోటిఫికేషన్ జారీతోనే సరిపెట్టారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోకి ఆస్పత్రులు చేరడం వల్ల వైద్య సేవలు ఎంతో మెరుగైతాయని అందరు భావించారు. పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలుపడంలో జాప్యం కారణంగా పోస్టులు అన్ని ఖాళీగానే ఉన్నాయి. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని, వైద్యులను డిప్యుటేషన్ పద్ధతిపై కమ్యూనిటీ ఆస్పత్రులలో కొనసాగిస్తున్నారు.

గర్భిణులకు..
ఆర్మూర్, బోధన్, నిజామాబాద్‌లలోని ఆస్పత్రులలో మినహా ఇతర సామాజిక వైద్యశాలల్లో గర్భిణులకు ప్రసవ సేవలు అందడం లేదు. సర్జన్‌లు, గైనకాలజిస్టులు లేకపోవడంతో శస్త్రచికిత్స ప్రసవ సేవలను పూర్తిగా నిలిపివేశారు. మోర్తాడ్ ప్రాంతం నుంచి ప్రసవాల కోసం మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించాల్సి వస్తుంది. ఆర్మూర్‌లో నిర్ణీత సంఖ్యలోనే ప్రసవ సేవలు అందిస్తుండటంతో పొరుగు జిల్లా ఆస్పత్రిని ఆశ్రయించక తప్పడం లేదు. ప్రభుత్వం వైద్య సేవలను విస్తృత పరచాలని పలువురు కోరుతున్నారు.

త్వరలోనే భర్తీ కావచ్చు..
సామాజిక ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది నియామకాలు త్వరలోనే పూర్తి కావచ్చు. గతంలో నోటిఫికేషన్ జారీ చేశాం. మరోసారి నోటిఫికేషన్ ఇచ్చి పోస్టుల భర్తీ కోసం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతాం. – డాక్టర్ శివశంకర్, వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి

పల్లెపల్లెనా ప్రగతి వీచికలు



సన్మాన కార్యక్రమంలో సఫాయి కార్మికుడి చొక్కాతో బాజిరెడ్డి



హైదరాబాద్‌కు వెళ్తున్న సర్పంచులు

- గ్రామగ్రామాన అట్టహాసంగా పల్లె ప్రగతి దినోత్సవం

సుభాష్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు పల్లెల ప్రగతిని ఆవిష్కరింపజేశాయి. ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, కంపోస్ట్ షెడ్ వంటి హంగులతో పల్లెలన్నీ దశాబ్ది వేడుకకు వేదికలుగా నిలిచాయి. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల్లో గురువారం నిర్వహించిన తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమాలతో ఎటుచూసినా పండుగ వాతావరణం కనిపించింది. గ్రామ పంచాయతీలు, పల్లె ప్రకృతి వనాలు తదితర వాటిని మామిడాకులు, పూల తోరణాలతో అలంకరించారు. గ్రామ పంచాయతీల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

వేడుకల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
ధర్పల్లిలో జరిగిన పల్లె ప్రగతి కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొనగా, సాటాపూర్‌లో బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆమిర్, నందిపేట్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు భాగస్వాములయ్యారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాలకు సమకూరిన నిధులు, మెరుగుపడిన మౌలిక వసతులు, సాధించిన ప్రగతితోపాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల వివిధ వర్గాల వారికి చేకూరిన లబ్ధి గురించి వక్తలు వివరించారు. పల్లెల పరిశుభ్రతలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న సఫాయి కార్మికుల సేవలను కొనియాడుతూ 'సఫాయి అన్నా.. సలాం అన్న' అని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కార్మికుల గౌరవాన్ని ఇనుమడింపజేశాయి. పల్లెల పరిశుభ్రత, ప్రగతి కోసం విశేషంగా కృషి చేసిన మల్టీ పర్పస్ వర్కర్ల సేవలకు గుర్తింపుగా వారిని ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. శానిటేషన్ విధులు నిర్వర్తిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి యూనిఫామ్, పాదరక్షలు, గ్లౌజులు, నూనె, సబ్బులు వంటి వస్తువులతో కూడిన జూట్ బ్యాగులను పంపిణీచేశారు.

రాజధానికి తరలివెళ్లిన ఉత్తమ సర్పంచులు

వివిధ అంశాల ప్రాతిపదికన జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికై న సర్పంచులు జిల్లా పంచాయతీ అధికారి జయసుధ నేతృత్వంలో గురువారం ఉదయం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. జిల్లా నుంచి మొత్తం 27 మంది సర్పంచులు, ఇద్దరు మల్టీ పర్పస్ వర్కర్లు ప్రత్యేక బస్సులో బయల్దేరి వెళ్లారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వీరిని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, హరీశ్‌రావుల చేతుల మీదుగా సన్మానించారు.

45 రోజులైనా..

- రైతుల ఖాతాల్లో జమకాని ధాన్యం డబ్బులు
- రూ.529 కోట్లకుపైనే చెల్లించాల్సి ఉంది
- వానాకాలం పంటలకు పెట్టుబడులు లేక అవస్థలు



సుభాష్‌నగర్ : ధాన్యం అమ్మి 45 రోజులైనా డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. మొత్తం రూ.529 కోట్లకుపైనే రైతులకు రావాల్సి ఉంది. అందులో ఓటీపీఎస్ పూర్తయిన వారికే రూ.330.76 కోట్లు జమ చేయాల్సి ఉంది. మరో వైపు వానాకాలం సీజన్ మొదలైంది. ఇప్పటికే నార్లు పోసి, నాట్ల కోసం మడులను సిద్ధం చేసుకుంటున్నారు. ధాన్యం డబ్బులు రాకపోవడం.. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో రైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

- జిల్లా వ్యాప్తంగా 459 కొనుగోలు కేంద్రాల ద్వారా 93,150 మంది రైతుల నుంచి 6.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఈ ధాన్యం విలువ రూ.1,313.05 కోట్లు ఉంటుంది. అందులో రూ.1129 కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి ఓటీపీఎస్ పూర్తయ్యింది. ఇంకా రూ.184 కోట్ల విలువైన ధాన్యానికి ఓటీపీఎస్ సొసైటీల్లో పూర్తి చేయాల్సి ఉంది.
- రూ.784 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశారు. మొత్తం రూ.529 కోట్లకుపైగా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది.
- ట్యాబ్ ఎంట్రీ, ట్రక్ షీట్ జనరేటెడ్, మిల్లర్ ఎక్నాలెడ్జ్‌మెంట్, ఓటీపీఎస్ తర్వాతే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. వారం రోజుల్లో రూ.345 కోట్లు జమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. కాగా సుమారు 100 వరకు లారీల ధాన్యం వివిధ రైస్‌మిల్లుల్లో అన్‌లోడింగ్ అవుతున్నాయి.

డబ్బుల కోసం ఎదురుచూపులు!

గత 15 రోజులుగా డబ్బులు జమ కావడం లేదని రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కాగా ఇప్పటికే నార్లు పోసుకుని, నాట్లు వేసుకునేందుకు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. సోయా, శనగ, ఇతర పంటల సాగుకు దుక్కులు పూర్తయ్యాయి. ఈనెల 19 తర్వాత ఎప్పుడైనా వర్షాలు కురిసే అవకాశమున్నందున రైతులు సిద్ధమవుతున్నారు.ప్రస్తుతం డబ్బులు చేతిలో లేక అవస్థలు పడుతున్నారు.

రూ. లక్ష వరకు రావాల్సి ఉంది



ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి నెల రోజులు గడిచిపోయింది. 130 బస్తాలను విక్రయించాను. సుమారు రూ.లక్ష వరకు రావాల్సి ఉంది. జూన్ పూర్తిగా పెట్టుబడుల నెల. పిల్లల స్కూల్ ఫీజులు, వానాకాలం వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో పెట్టుబడికి డబ్బుల్లేక ధాన్యం విక్రయించిన సొమ్ము కోసం ఎదురుచూస్తున్నాను. ఎరువులు, విత్తనాలు, వరి కోత యంత్రాలు, ట్రాక్టర్ అద్దె చెల్లించేందుకు డబ్బులు లేవు. సొసైటీలో అడిగితే త్వరలో వస్తాయని చెప్తున్నారు. వెంటనే ధాన్యం డబ్బులు జమ చేసేలా చూడాలి.
– కేపీ నర్సారెడ్డి, రైతు, నల్లవెల్లి, ఇందల్వాయి మండలం

వారంలోపు రూ.345కోట్లు జమ



రైతులు అమ్మిన ధాన్యానికి సంబంధించి ఓటీపీఎస్ పూర్తయిన రూ.345 కోట్లు వారం రోజుల్లో జమ అవుతాయి. రైతుల వివరాలను ఇప్పటికే నివేదించాం. డబ్బులు జమ కావడంలో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమే. మిగతా డబ్బులు కూడా వీలైనంత త్వరగా జమ చేసేలా చర్యలు చేపడుతున్నాం. రైతులెవరూ ఆందోళన చెందొద్దు. – జగదీష్‌కుమార్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

క్లుప్తంగా

కొనసాగుతున్న ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్మీడియట్‌ అడ్వాన్స్‌డ్‌ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం గణితము–1,జంతు శాస్త్రము, చరిత్ర పరీక్షలు జరిగాయి. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 6735 మంది విద్యార్థులకు 342 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, 6,393 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జనరల్‌ విద్యార్థులు 6,085 మందికి గాను 5,716 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌ 650మందికి గాను 627 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలో 2365 మంది విద్యార్థులకుగాను 2267 మంది పరీక్షలు రాశారు. జిల్లా ఇంటర్‌ విద్యాశాఖ అధికారి రఘురాజ్‌ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆర్యనగర్‌లోని ఎస్సార్‌ జూనియర్‌ కళాశాల పరీక్ష కేంద్రం, శ్రీ కాకతీయ జూనియర్‌ కళాశాల, కాకతీయ మహిళా జూనియర్‌ కళాశాల నిర్మలహృదయ జూనియర్‌ కళాశాల సహా పలు పరీక్షా కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేశారు.

ఎస్సెస్సీ సప్లిమెంటరీ..

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో గురువారం రెండోరోజు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 125 మంది విద్యార్థులకు గాను 60 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. డీఈవో సహా పలువురు అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఈసెట్‌లో జిల్లా విద్యార్థికి ఉత్తమ ర్యాంకు


పాలపల్లి నిఖిల్‌

నిజామాబాద్‌అర్బన్‌: ఇటీవల వెలువడిన ఈసెట్‌ ఫలితాలలో జిల్లా కేంద్రానికి చెందిన పాలపల్లి నిఖిల్‌ 200 మార్కులకు గాను 150 మార్కులు సాధించాడు. దీంతో నిఖిల్‌ బ్రాంచ్‌ ఈఈఈ పరంగా రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు, ఇంటిగ్రేటెడ్‌ పరంగా రాష్ట్రస్థాయి 17వ ర్యాంకు సాధించాడు. ఇతను జిల్లా కేంద్రంలోని సుభాష్‌ నగర్‌ ప్రాంతాల్లో నివసిస్తున్నాడు. పదో తరగతి దుబ్బాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యసించాడు. అనంతరం పాలిటెక్నిక్‌లో విద్యను అభ్యసిస్తుండగా ఈసెట్‌ రాసి ఉత్తమ మార్కులు సాధించాడు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఫెస్టిసైడ్‌ దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయించొద్దని, అమ్మితే కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేస్తామని ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం వెల్లడించారు. మండల కేంద్రంలోని జై యోగేశ్వర, జగదాంబ, శ్రీఆంజనేయ తదితర ఫెస్టిసైడ్‌ దుకాణాల్లో గురవారం వారు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా విక్రయిస్తున్న విత్తనాలు, వాటికి సంబంధించిన బిల్లులను పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన కంపెనీల ఉత్పత్తులు మాత్రమే విక్రయించాలని సూచించారు. ప్రతి కొనుగోలుదారుడికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నిర్వాహకులు ధరల పట్టికలను దుకాణంలో బోర్డుపై ప్రదర్శించాలన్నారు. ఏవో అనిల్‌కుమార్‌, దుకాణాల యజమానులు ఉన్నారు.

ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి అవార్డు



మోపాల్‌(నిజామాబాద్‌ రూరల్‌): జిల్లాకు చెందిన ఇద్దరు జీపీ కార్మికులు ఉత్తమ సేవలకు గాను రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం రాష్ట్ర స్థాయి పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తమ సేవలను అందించిన పలువురు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రాష్ట్రస్థాయి అవార్డులు అందజేశారు. ఇందులో మోపాల్‌ మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన జోగు అమ్మక్క, మెండోరా మండలం బుస్సాపూర్‌ గ్రామానికి చెందిన మారుతిని నిర్వాహకులు సన్మానించి, అవార్డును అందజేశారు.



అనుమతిలేని బడులపై చర్యలేవి?

- జిల్లాలో విచ్చలవిడిగా ప్రయివేట్‌ పాఠశాలల ఏర్పాటు
- ఫిర్యాదులు వచ్చినా స్పందించని విద్యాశాఖ అధికారులు



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో ప్రయివేట్‌ పాఠశాలలు, ప్లే స్కూల్స్‌ విచ్చలవిడిగా వెలుస్తున్నాయి, ఎలాంటి అనుమతి లేకుండానే వీటి నిర్వహణ కొనసాగుతోంది. అయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యాశాఖ అధికారులు మామూళ్లకు అలవాటు పడి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

జిల్లాకేంద్రంలోనే ఎక్కువ..

అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న ప్రయివేటు పాఠశాలలు జిల్లా కేంద్రంలోనే ఎక్కువగా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో వినాయక్‌నగర్‌, కంఠేశ్వర్‌. రేడియోస్టేషన్‌, సుభాష్‌నగర్‌ ప్రాంతంలో ఇటీవల వెలసిన పలు ప్రయివేట్‌ పాఠశాలలకు అనుమతి లేదు. వినాయక్‌నగర్‌లో ఓ కార్పొరేట్‌ పాఠశాలకు 8నుంచి 10 వరకు అనుమతి లేదు. అలాగే ఆటోనగర్‌లో 6సంవత్సరాలుగా ఓ ప్రయివేట్‌ పాఠశాల 6నుంచి 10వరకు అనుమతి లేకుండా కొనసాగుతోంది.

ప్లే స్కూల్స్‌ అంతే..

ఈ ఏడాది జిల్లాలో 21 వరకు ప్లే స్కూల్స్‌ నూతనంగా ఏర్పడ్డాయి. ఇందులో సుమారు 15 వరకు జిల్లా కేంద్రంలోనే కొనసాగుతున్నాయి. కానీ వీటిలో చాలా వాటికి ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం ముందస్తుగా జిల్లా విద్యాశాఖ అధికారి, లేదా సంబంధిత మండల విద్యాశాఖ అధికారి అనుమతి పొందాల్సి ఉంటుంది. అధికారుల పరిశీలన అనంతరం అనుమతి మంజూరు చేస్తారు. ఇలాంటి నిబంధనలు ఏమీ లేకుండానే నివాస భవనాలను ఎంపిక చేసుకొని కొందరు ప్లే స్కూల్స్‌ కొనసాగిస్తున్నారు. సుభాష్‌నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్లే స్కూల్‌ కొనసాగిస్తున్నాడు. అలాగే ఆర్మూర్‌లో రిటైర్డ్‌ టీచర్‌ ప్లే స్కూల్‌ నిర్వహిస్తున్నాడు.

కనీస సౌకర్యాలు కరువు..

నిర్వాహకులు అనుమతి లేకుండా బడులు, ప్లే స్కూల్స్‌ ఏర్పాటు చేస్తుండగా.. కనీసం విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. పలువురు నివాస భవనంలో ప్లేస్కూల్స్‌ను కొనసాగిస్తున్నారు. ఆర్మూర్‌ రోడ్డులోని ఓ అద్దె ఇంటిలో కొనసాగుతున్న స్కూల్‌లో 40మంది విద్యార్థులలు ఉండగా.. వీరందరికీ ఒకే బాత్‌ రూమ్‌ ఉండటంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా బడుల్లో విద్యార్థులకు ఆట వస్తువులు, తాగునీరు, విడివిడిగా బాత్రూంలు అందుబాటులో లేవు. 40 మంది విద్యార్థులు ఉన్నా.. ఒక ఆయ, ఇద్దరు లేదా ముగ్గురు టీచర్లతోనే పాఠశాలలను కొనసాగిస్తున్నారు

విద్యార్థిసంఘాల ఆందోళన..

అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్లేస్కూల్స్‌ విద్యాశాఖ అధికారులకు మాముళ్లను తెచ్చిపెడుతున్నాయని సమాచారం. దీంతో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గత రెండు రోజుల క్రితం వినాయక్‌నగర్‌లో ఓ కార్పొరేట్‌ పాఠశాలకు 8నుంచి 10 తరగతి వరకు అనుమతి లేదు. దీంతో విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం సంఘ నాయకులు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. అక్కడి వెళ్లి విచారణ చేసిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సంబంధిత అధికారులే విద్యార్థి సంఘాల నాయకులను సమన్వయం చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతి లేని బడులపై తగిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో ఎక్కడైనా అనుమతి లేకుండా ప్రయివేటు పాఠశాలలు, ప్లే స్కూల్స్‌ కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు చేపడతాం. తల్లిదండ్రులు సైతం అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దు.

–దుర్గాప్రసాద్‌, డీఈవో, నిజామాబాద్‌

ధాన్యం డబ్బులు వెంటనే జమ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రెడ్డి

సుభాష్‌నగర్‌: రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని విక్రయించి 45 రోజులు కావస్తున్నా.. డబ్బులు ఇంతవరకూ రైతుల ఖాతాల్లో జమ చేయలేదని, వెంటనే బకాయి ఉన్న రూ.600 కోట్ల వరకు ధాన్యం సొమ్ము జమ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. తనను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించేందుకు కృషి చేసిన ఎంపీ అర్వింద్‌ ధర్మపురి, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎరువులకు, విత్తనాలు, యంత్రాలు, ట్రాక్టర్లు, కూలీలు డబ్బుల కోసం రైతుల ఇళ్ల చుట్టూ తిరుగుతుండగా, రైతులు మాత్రం సొసైటీల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. రాబోయే సీజన్‌కు పెట్టుబడి డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని ఆరోపించారు. మెనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.లక్ష రుణమాఫీ ఏమైందని మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రశ్నించారు. రైతాంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని విమర్శించారు.

పత్తాలేని పంట, నీటి ప్రణాళిక..

పంటల సీజన్‌కు ముందే కలెక్టర్‌ ఆధ్వర్యంలో వ్యవసాయ, నీటిపారుదల అనుబంధ శాఖల అధికారుల తో మంత్రి సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఇప్పటివరకూ పంట ప్రణాళిక, నీటి ప్రణాళిక లేదని మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాళేశ్వరంతో ఒ క్క ఎకరా కూడా పారడం లేదని, వర్షాలు అనుకూలించడం వల్లే పంటలు పండుతున్నాయని అభిప్రాయపడ్డారు. రైతాంగ సమస్యలపై పార్టీ సూచనల మేరకు త్వరలోనే ధర్నాలు చేపడుతామని పేర్కొన్నారు. నాయకులు సరేన్‌, నీలేష్‌, నారాయణ, లక్ష్మణ్‌, నాగభూషణ్‌, ఆంజనేయ రెడ్డి ఉన్నారు.

'మంత్రి అండతో ఇసుక అక్రమ రవాణా'


మాట్లాడుతున్న ఏలేటి మల్లికార్జున్‌ రెడ్డి

భీమ్‌గల్‌: మంత్రి ప్రశాంత్‌ రెడ్డి అండతోనే భీమ్‌గల్‌ మండలంలో ఇసుక అక్రమ రవాణా సాగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌ రెడ్డి అన్నారు. భీమ్‌గల్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని మొగిలి చెరువు, కప్పల వాగు, గోన్గొప్పుల గ్రామంలోని కొత్తకుంట చెరువులో విచ్చలవిడిగ అక్రమంగా మొరం, ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఒకే వే బిల్లుపై తేదీలను మారుస్తూ అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. మంత్రి ప్రశాంత్‌ రెడ్డి అండతో 100 పడకల ఆస్పత్రి సాకు చూపుతూ భీమ్‌గల్‌ నుంచి హైదరాబాద్‌ వరకు ఇసుకను తరలిస్తున్నారన్నారు. అధికారులు ఇవ్వాల్సిన వే బిల్లులను బీఆర్‌ఎస్‌ నాయకులు ఇస్తున్నారంటే రెవెన్యూ అధికారుల ప్రమేయంతోనే అక్రమ వ్యాపారం జరుగుతోందని అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టకపోతే కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. నాయకులు మహిపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడి మృతి

మాక్లూర్‌: కాలకృత్యాలకని చెరువు వద్దకు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మండలంలోని వల్లభాపూర్‌ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గూండ్ల ఎరుగట్ల రాము(15) అనే బాలుడు మేకల కాపరిగా ఉండేవాడు. అతడి తల్లి పుష్ప బీడీ కార్మికులు కాగా, తండ్రి రాజు చేపలు పడుతుంటాడు. గురువారం రాత్రి రాము మేకలను కొట్టంలో ఉంచి, స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. ఎంతకీ అతడు ఇంటికి రాకపోవటంతో తల్లితండ్రులు గ్రామంలో వెతికారు. స్నేహితులను ప్రశ్నించగా, రాము కాలకృత్యాలకని చెరువుకుంటకు వెళ్లినట్లు తెలిపారు. దీంతో గ్రామస్తులతో కలిసి వారు చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో గాలించి రాము మృతదేహాన్ని వెలికితీశారు. కుమారుడి మృతిని తట్టుకోలేక తల్లి తండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

క్రైం కార్నర్‌

విషాదం నింపిన విహారయాత్ర

- నెల్లూరు సముద్రతీరంలో నవీపేట మండల వాసి మృతి
- బీచ్‌లో స్నానం చేస్తుండగా అలలకు కొట్టుకుపోయిన యువకుడు


సన్నీగౌడ్‌ (ఫైల్‌)

నవీపేట: మండలంలోని ఓ యువకుడు విహారయాత్రలో భాగంగా నెల్లూరు సమీపంలోని బీచ్‌కు వెళ్లగా ప్రమాదవశాత్తు అలల్లో కొట్టుకుపోయి, మృతిచెందాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ఆశాజ్యోతి కాలనీకి భీమగోని బాల్‌రాజ్‌గౌడ్‌, విజయలకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో కుమార్తె మమతకు వివాహం జరిగింది. పెద్దకొడుకు సాయికుమార్‌ ఉపాధి నిమిత్తం యేడాది కిందట దుబాయ్‌ వెళ్లాడు. చిన్న కుమారుడు సన్నీగౌడ్‌(23)ను సైతం గల్ఫ్‌కు పంపించాలని తండ్రి సిద్ధమయ్యాడు. దుబాయ్‌లో ఇప్పుడిప్పుడే రాణిస్తున్న పెద్దకుమారుడి అండతో చిన్నకుమారుడిని కూడా దుబాయ్‌ పంపించాలని ఇటీవల పాస్‌పోర్ట్‌ తీయించాడు. అనంతరం వీసా కోసం సన్నీగౌడ్‌ పలు కంపెనీలు, ఏజెంట్ల దగ్గరకు వెళ్లాడు. మరికొన్ని రోజుల్లో దుబాయ్‌ వెళ్లేందుకు నిశ్చయించుకున్నాడు. దుబాయ్‌కు వెళ్లే ముందు ఇంటి దైవమైన తిరుమల తిరుపతి దేవుడిని సందర్శించుకుందామని తల్లిదండ్రులకు చెప్పాడు. రెండు రోజుల కిందట తల్లిదండ్రులతోపాటు భువనగిరిలో ఉండే సమీప బంధువులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. తిరుపతిలో దైవదర్శనం పూర్తయిన తర్వాత వారు తిరుగుప్రయాణంలో నెల్లూరు మీదుగా ప్రయాణించి మరిన్ని దేవాలయాలను దర్శించుకోవాలని నిర్ణయించుకున్నారు. సన్నీగౌడ్‌ బుధవారం సాయంత్రం నెల్లూరు సమీపంలోని బీచ్‌లో స్నానం చేయాలని తీరంలోకి దిగారు. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా స్నానం చేస్తున్న సన్నీగౌడ్‌ను అలల రూపంలో వచ్చిన మృత్యువు తీరం లోపలకు తీసుకెళ్లి కబళించింది. ప్రాణాలను మింగి శవాన్ని ఒడ్డుకు విసిరేసింది. ఒక్కసారిగా షాక్‌కు గురైన తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. ఈ ఘటనతో సొంత గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం ఉదయం సొంత గ్రామంలో అంత్రక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


సాయివంశీ (ఫైల్‌)

నవీపేట: మండలంలోని జన్నెపల్లి గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోతంగల్‌ గ్రామానికి చెందిన కొండ సాయివంశీ అలియాస్‌ చింటు(23) మృతి చెందినట్లు ఎస్సై రాజరెడ్డి తెలిపారు. చింటు తన బైక్‌ను రిపేరు చేయించేందుకు మరో వాహనం సహాయంతో జన్నెపల్లి గ్రామానికి బయలుదేరాడు. ఈక్రమంలో ఎదురుగా వేగంగా వస్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు సువర్ణ, గంగాధర్‌, సోదరి ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తెయూలో కొనసాగుతున్న సమ్మె

తెయూ(డిచ్‌పల్లి): జీతాల కోసం తెలంగాణ యూనివర్సిటీ ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాలుగో రోజు కొనసాగింది. తెయూ పరిపాలనా భవనం ఎదుట వారు బైటాయించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వీసీ, రిజిస్ట్రార్‌ల నిర్లక్ష్యం వల్ల 15 రోజులు గడుస్తున్నా తమకు జీతాలు అందలేదని ఆరోపించారు. పోటాపోటిగా వీసీ ఒకరిని, పాలకమండలి మరొకరిని రిజిస్ట్రార్‌లుగా నియమించడంతోనే వివాదం నెలకొని జీతాలు నిలిచిపోయాయన్నారు. బుధవారం యూనివర్సిటీకి వచ్చిన వీసీ ప్రొఫెసర్‌ రవీందర్‌ను ఘెరావ్‌ చేయగా ఏజెన్సీ ద్వారా గురువారం జీతాలు వేయిస్తానని చెప్పి తప్పించుకుపోయారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జీతాలు అందే వరకు సమ్మె కొనసాగుతుందని ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది తెలిపారు.

క్యాంపస్‌ విద్యార్థుల పస్తులు..

తెలంగాణ యూనివర్సిటీలో జీతాల కోసం తెయూ

తెయూ సమాచారం



అవుట్‌ సోర్సింగ్‌ సిబ్బంది నాలుగు రోజులుగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తుండగా.. హాస్టల్స్‌ మెస్‌లో భోజనాలు వండేవారు లేక విద్యార్థులు పస్తులతో కాలం గడపాల్సి వస్తోంది. మెస్‌ సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం నుంచి భోజనాలు వండటం నిలిపివేశారు. గురువారం సైతం అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది సమ్మె కొనసాగడంతో వారికి భోజనాలు లేకుండా పోయాయి. దీంతో హాస్టల్స్‌ విద్యార్థులు తెయూ మెయిన్‌ గేటు ఎదుట ఖాళీ ప్లేట్లతో బైఠాయించి నిరసన తెలిపారు. కొందరు విద్యార్థులు పక్కనే ఉన్న నడిపల్లి తండాకు వెళ్లి ఇంటింటికీ తిరిగి భిక్షాటనతో కడుపు నింపుకున్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్‌ ఎన్నిక

తెలంగాణ యూనివర్సిటీ మెయిన్‌ క్యాంపస్‌ (డిచ్‌పల్లి), భిక్కనూర్‌ సౌత్‌క్యాంపస్‌, సారంగపూర్‌ ఎడ్యుకేషన్‌ క్యాంపస్‌లలో పని చేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్‌ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్సిటీ ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌ కళాశాలలో ఎన్నికలు నిర్వహించినట్లు అసోసియేషన్‌ పూర్వ అధ్యక్షుడు యెండల ప్రదీప్‌ తెలిపారు. నూతన ప్రెసిడెంట్‌గా ప్రసన్న, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా ఇంద్రకరణ్‌రెడ్డి, వైస్‌ ప్రెసిడెంట్‌గా హరిత, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్‌ తాహెర్‌, కోశాధికారిగా గంగాధర్‌, జాయింట్‌ సెక్రటరీగా కనకయ్య, మీడియా ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌గౌడ్‌, సభ్యులుగా సునీల్‌, రఘువీర్‌, అశోక్‌ చౌహాన్‌, గణేష్‌ నాయక్‌, వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ బ్యాక్‌లాగ్‌ పరీక్ష తేదీల్లో మార్పు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ బ్యాక్‌లాగ్‌ పరీక్ష తేదీల్లో మార్పులు చేసినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న జరగాల్సిన జియోగ్రఫీ సబ్జెక్టు 1వ, 6వ సెమిస్టర్‌ పరీక్ష ఈ నెల 27న, ఈ నెల 21న జరగాల్సిన జియోగ్రఫీ 2వ, 3వ, 4వ సెమిస్టర్‌ పరీక్షలు 28న, ఈ నెల 23న జరగాల్సిన జియోగ్రఫీ 5వ సెమిస్టర్‌ పరీక్ష జూలై 8న జరుగుతాయన్నారు. అలాగే ఈ నెల 22న జరగాల్సిన ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ 1వ సెమిస్టర్‌ పరీక్ష ఈ నెల 24న, ఈ నెల 26న జరగాల్సిన మ్యాథమెటిక్స్‌ 3వ, 4వ సెమిస్టర్‌ పరీక్షలు ముందస్తుగా ఈ నెల 23న జరుగుతాయన్నారు. ఈ నెల 23న జరగాల్సిన ప్రోగ్రామింగ్‌ విత్‌ సీ పరీక్ష ఈ నెల 28న జరుగుతుందన్నారు. సంబంధిత విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని, వివరాలకు www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని కంట్రోలర్‌ అరుణ సూచించారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో వెండి పతకం



పెర్కిట్‌(ఆర్మూర్‌): మామిడిపల్లిలోని విజయ్‌ హైస్కూల్‌ విద్యార్థి శశాంక్‌(6వ తరగతి) మినీ జూనియర్‌ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం కవిత దివాకర్‌ గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం అనంతపురం జిల్లాలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో శశాంక్‌ అద్భుత ప్రతిభతో సిల్వర్‌ మెడల్‌ సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శశాంక్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించారు. పీఈటీలు సురేష్‌, ధర్మపురి పాల్గొన్నారు.

మరో ఐదుగురికి నోటీసులు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలో 'స్తంభం మార్చినందుకు డబ్బులు డిమాండ్‌' అనే కథనానికి సంబంధించి కథనానికి అధికారులు స్పందించారు. ఇప్పటికే కన్‌స్ట్రక్షన్‌ డీఈ వెంకటరమణ విచారణ ప్రారంభించిన విషయం తెలిసిందే. జేఎల్‌ఎం రవిని విచారించారు. గురువారం తాజాగా మరో ఐదుగురికి నోటీసులు అందజేశారు. వీరిని సైతం విచారణకు హాజరు కావాలన్నారు. నోటీసులు అందుకున్న అధికారులు, సిబ్బంది నిర్ణీత సమయంలో వచ్చి విచారణకు సహకరించాలని అధికారులు పేర్కొన్నారు.

నీట్‌లో ఉషోదయ విద్యార్థుల ప్రతిభ


షేక్‌ జోహనబీరా


ముస్కాన్‌ ఫాతిమా


మహ్మద్‌ అబుజర్‌

బోధన్‌టౌన్‌(బోధన్‌): ఇటీవల విడుదలైన నీట్‌ ఫలితాల్లో పట్టణంలోని ఉషోదయ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు పొందారని చైర్మన్‌ సూర్యప్రకాష్‌ గురువారం తెలిపారు. షేక్‌ జోహనబీరా–555 మార్కులు, ముస్కాన్‌ ఫాతిమా 512 మార్కులు, మహ్మద్‌ అబుజర్‌ 477 మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల డైరెక్టర్‌ దుష్యంత్‌, ప్రిన్సిపల్‌ ఆనందరెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

సాదిక్‌ను హత్య చేసింది తమ్ముళ్లు కాదు

- అతడి డబ్బులను కాజేసేయత్నంలో హత్య చేసిన మరో వ్యక్తి
- వివరాలు వెల్లడించిన ఎస్‌హెచ్‌వో నరేష్‌

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని పాత బస్టాండ్‌ ప్రాంతంలో ఇటీవల సాదిక్‌ (50) అనే వ్యక్తిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు గుర్తించారు. మొదట అతడిని తమ్ముళ్లే హత్య చేసి ఉంటారని అందరూ భావించారు. కానీ పోలీసుల విచారణలో సాదిక్‌ను హత్య చేసింది తమ్ముళ్లు కాదనీ, వారిని గమనిస్తున్న మరో వ్యక్తి అని తేలింది. ఈమేరకు ఎస్‌హెచ్‌వో నరేష్‌ గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 7న రాత్రి బతుకమ్మకుంట కాలనీకి చెందిన సాదిక్‌ కామారెడ్డి పాత బస్టాండ్‌ ప్రాంతంలో హత్యకు గురయ్యాడు. విచారణ చేపట్టిన పట్టణ పోలీసులు హత్యకు పాల్పడింది అదే ప్రాంతంలో నివాసం ఉండే ఎల్లం అనే వ్యక్తిగా నిర్ధారించారు. ఒంటరిగా ఉన్న సాదిక్‌ దగ్గర మొబైల్‌ ఫోను డబ్బులు ఉన్నట్లుగా ఎల్లం, తోకల సాయి అనే వ్యక్తులు గమనించారు. వారిలో సాయి ముందుగా సాదిక్‌ మొబైల్‌ ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. ఆ తర్వాత మద్యం మత్తులో పడి ఉన్న సాదిక్‌ జేబులోని డబ్బులను ఎల్లం కాజేసే ప్రయత్నం చేశాడు. సాదిక్‌ తిరగబడి అక్కడే ఉన్న ఓ సీసాతో ఎల్లంపై దాడి చేశాడు. ఆ కోపంలో ఎల్లం అక్కడే ఉన్న బండరాయితో సాదిక్‌ తలపై బలంగా మోదీ హత్య చేశాడు. దీంతో ఎల్లంను, మొబైల్‌ చోరీ చేసినందుకు తోకల సాయిని గురువారం సాయంత్రం అరెస్ట్‌ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని కంజర్‌ గ్రామంలో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దయాళ్‌సింగ్‌ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కొయాడి ప్రశాంత్‌ గౌడ్‌(40)కు భార్య నవత, ఓ పాప ఉంది. గత కొన్ని నెలలుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. డబ్బులు కావాలని భార్య మానసిక వేధింపులకు గురిచేసేది. ఈక్రమంలో వారిద్దరి మధ్య మనస్పర్ధలు ఏర్పడి ఆరు నెలల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. ప్రశాంత్‌ కల్లు దుకాణం నడుపుతూ తల్లితో కలిసి ఉంటున్నాడు. అతడి తల్లి చంద్రకళ ఇటీవల తన కుమార్తె ఇంటికి నిర్మల్‌కు వెళ్లింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది ప్రశాంత్‌ బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు వెళ్లి చూసేసరికి మంచంపై అతడువిగత జీవిగా పడి ఉన్నాడు. వెంటనే వారు తల్లికి, భార్యకు సమాచారమిచ్చారు. మృతుడి తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రాస్పత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో ఓ తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా.. కాలనీలో నివాసం ఉండే శ్రీనివాస్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా గురువారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం ధ్వంసం చేసి ఉండటంతో లోపలికి వెళ్లి చూశారు. దుండగులు ఇంట్లోని కప్‌బోర్డ్‌ తాళం పగలగొట్టి బట్టలు చిందరవందర చేశారు. కాగ అందులో ఉన్న ముదున్నర తులాల బంగారం, 25 తులాల వెండి, ఒక స్మార్ట్‌ టీవీని చోరీ చేశారు. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైకుంఠధామంలో బోరుమోటార్‌..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెల్లకుంటతండా గ్రామపంచాయతీ పరిధిలోని వైకుంఠధామంలో ఏర్పాటుచేసిన బోరుమోటార్‌ను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన గురువారం వెలుగుచూసింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సర్పంచ్‌ కేస్లీభాయి, పంచాయతీ కార్యదర్శి సవాయిసింగ్‌ తండావాసులతో కలిసి గురువారం వైకుంఠధామాన్ని సందర్శించారు. దీంతో వైకుంఠధామంలోని బోర్‌మోటార్‌ చోరీకి గురైన విషయం వెలుగులోకి వచ్చింది. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి సవాయిసింగ్‌ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో రెండురోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు గురువారం ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. ఈనెల 3న దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సదాశివనగర్‌ మండలం పద్మాజివాడికి చెందిన కాటిపల్లి సాయిరెడ్డి డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని గురువారం కోర్టుకు హాజరుపర్చగా, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్‌ నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 300 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.